సాక్షి
తిరుపతి

గురువారం, 12, జూన్, 2025



'తోతాపురి'.. రూ.8కి కొనాల్సిందే!
పాకాల మండలం దామలచెరువులో తోతాపురి ధరలపై మామిడి రైతులతో ఆర్‌డీఓ రామ్మోహన్ మాట్లాడారు. - 8లో



బడుగు బతుకుల ఆక్రందన
శ్రీకాళహస్తి మండలం ఇలగనూరులో కుమ్మరి సామాజికవర్గంపై టీడీపీ నేతలు దౌర్జన్యానికి పాల్పడ్డారు. - 8లో



అత్యుత్తమ సేవలకు 'స్విమ్స్'
తిరుపతి మహతి ఆడిటోరియంలో బుధవారం స్విమ్స్ యూనివర్సిటీ స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. - 8లో

న్యూస్‌రీల్

బస్‌పాస్‌ల జారీకి బ్రేక్
– 14 నుంచి పునఃప్రారంభం



తిరుపతి ఏడుకొండల బస్టాండ్‌లో పాస్‌లు తీసుకుంటున్న విద్యార్థులు

తిరుపతి అర్బన్ : జిల్లాలో గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న నేపథ్యంలో బుధవారం ఆర్టీసీ అధికారులు విద్యార్థులకు బస్ పాస్‌లు జారీ చేపట్టారు. అయితే కొత్త మోడల్‌లో పాస్ ఇవ్వాలని నిర్ణయించినందున ప్రక్రియను నిలుపుదల చేసినట్లు ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ విశ్వనాథం వెల్లడించారు. ఈ మేరకు శనివారం నుంచి జిల్లాలోని అన్ని ఆర్టీసీ డిపోల్లో విద్యార్థులకు బస్‌పాస్‌లు జారీ చేయనున్నట్లు వివరించారు. అలాగే కొత్తగా బస్‌పాస్ తీసుకునే వారు రిజిస్ట్రేషన్ కోసం బస్టాండ్‌కు వెళ్లలేని పరిస్థితుల్లో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు.

వీఆర్‌కు వెంకటగిరి ఎస్‌ఐ

వెంకటగిరి (సైదాపురం) : వెంకటగిరి ఎస్‌ఐ సుబ్బారావును వీఆర్‌కు పంపుతూ ఎస్పీ హర్షవర్ధన్‌రాజు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. విధి నిర్వహణలో అలసత్వం, దురుసు ప్రవర్తన కారణంగా ఆయనపై వేటు పడినట్లు తెలిసింది. ఎస్‌ఐ వ్యవహారశైలిపై పలు ఆరోపణలు రావడంతో ఎస్పీ విచారణ చేయించి వచ్చిన నివేదిక మేరకు చర్యలు తీసుకున్నట్లు సమాచారం.

నేడు 501 నుంచి ఎస్జీటీల కౌన్సెలింగ్

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని ఎస్జీటీల సీనియారిటీ జాబితాలో 501 సీరియల్ నంబర్ నుంచి ఈనెల 12న బదిలీల కౌన్సెలింగ్ ఉంటుందని డీఈఓ వరలక్ష్మి వెల్లడించారు. ఈ మేరకు బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. చిత్తూరులోని షర్మన్ పాఠశాలలో గురువారం 501 నంబర్ నుంచి 1000 వరకు ఎస్జీటీల బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. సంబంధిత టీచర్లు కౌన్సెలింగ్‌కు తప్పక హాజరు కావాలని ఆదేశించారు.

వేసవి సెలవులు ముగిశాయి.. నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభమవుతున్నాయి.. అయితే సర్కారు బడుల్లో మాత్రం సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. అరకొర వసతుల నడుమ చదువులు కొనసాగనున్నాయి. అసంపూర్తిగా మిగిలిన తరగతి గదులు.. మరుగుదొడ్లు.. ప్రహరీగోడలు వెక్కిరిస్తున్నాయి. పిల్లలకు అవసరమైన విద్యాసామగ్రి ఇప్పటి వరకు అంతంతమాత్రంగానే అందాయి. బదిలీల ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో స్కూళ్ల రాలేని పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి నిరుపేద విద్యార్థుల భవితను ప్రశ్నార్థకంగా మార్చేస్తున్నాయి.

నరసింగాపురం జెడ్పీ హైస్కూల్‌లో అసంపూర్తిగా భవనం



సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

అరకొర వసతులు..
అవస్థల చదువులు

నేటి నుంచి పాఠశాలల పునఃప్రారంభం

- సమస్యలతో స్వాగతం పలుకుతున్న సర్కారు బడులు
- అసంపూర్తిగా నాడు–నేడు పనులు
- పూర్తికాని ఉపాధ్యాయ బదిలీలు
- సక్రమంగా అందని విద్యాసామగ్రి కిట్‌లు
- పలు స్కూళ్లలో పనిచేయని ఆర్‌ఓ ప్లాంట్లు
- ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై ఆవేదనలో తల్లిదండ్రులు

తిరుపతి ఎడ్యుకేషన్ : బడి గంట మోగనుంది. గురువారం నుంచి పాఠశాలలు ప్రారంభంకానున్నాయి. ఏప్రిల్ 24 నుంచి ప్రకటించిన వేసవి సెలవులు ముగియడంతో విద్యార్థులు మళ్లీ చదువు బాట పట్టనున్నారు. అయితే ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు పూర్తిస్థాయిలో వసతులు సమకూర్చలేదని తల్లిదండ్రులు మండిపడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో తరహాలో కాకుండా కూటమి సర్కారు అలసత్వం వహిస్తోందని ఆవేదన చెందుతున్నారు. కనీసం పాఠ్యపుస్తకాలు, నోట్బుక్‌లను కూడా సక్రమంగా అందించలేదని వాపోతున్నారు. చివరకు బూట్లు, టై, సాక్సులు, యూనిఫామ్‌ను కూడా పూర్తిస్థాయిలో పంపిణీ చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎక్కడ వేసిన గొంగళి అక్కడే..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాడు- నేడు పథకం కింద సర్కారు బడులను అద్భుతంగా తీర్చిదిద్దారు. తొలి, మలి విడతల్లో పలు పాఠశాలను ఎంపిక చేసి అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు నిర్మించారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. నాడు–నేడు పథకానికి అరకొర నిధులు మంజూరు చేయడంతో జిల్లాలోని పలు పాఠశాలల్లో అసంపూర్తిగానే నిర్మాణాలు ఉన్నాయి. దీంతో విద్యార్థులకు అవస్థలు తప్పని దుస్థితి దాపురించింది.

గతంలో విద్యారంగానికి పెద్దపీట

ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలంటే ప్రజల్లో చిన్నచూపు ఉండేది. పాత భవనం, పెచ్చులూడిన గోడలు, సరైన బల్లలు, ఇతర మౌలిక వసతులు లేకపోవడంతోనే జనాలకు సర్కారు బడులపై నమ్మకం సన్నగిల్లింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యారంగం అభివృద్ధికి పెద్దపీట వేసింది. నాడు- నేడు పథకం కింద సర్కారు పాఠశాలల రూపురేఖలను మార్చేసింది. కార్పొరేట్‌కు దీటుగా వసతులు కల్పించింది. ఆధునిక సాంకేతికతను మేళవించి విద్యాబోధనలో మార్పులు తీసుకొచ్చింది. తెలుగుతో పాటు ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టి విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలా తీర్చిదిద్దింది. పేద పిల్లలకే సర్కారు బడుల్లో చదువుతారనే భావనను పోగొట్టి ప్రతి విద్యార్థీ ఆసక్తి చూపించే స్థాయికి తీసుకువచ్చింది. గత ప్రభుత్వ పాలనలో సర్కారు బడుల్లో అడ్మిషన్లు ఫుల్ అనే బోర్డులు పెట్టిన పరిస్థితి ఉండేది. చివరకు సీటు దక్కించుకునేందుకు సిఫార్సులు చేయించాల్సి వచ్చేది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యారంగం కుదేలైంది. కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లకే సర్కారు అండగా నిలవడంతో ప్రభుత్వ విద్య క్రమేణా వెనుకంజ వేసింది. ఒకప్పుడు అడ్మిషన్లు ఫుల్ అని బోర్డులు పెట్టిన ప్రభుత్వ పాఠశాలల్లో నేడు అడ్మిషన్ల కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి దాపురించింది.

పూర్తి స్థాయిలో అందని కిట్లు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు స్టేషనరీ భారం కాకూడదనే సదుద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ హయాంలో జగనన్న విద్యాకానుక పథకం ప్రవేశపెట్టారు. కార్పొరేట్‌కు దీటుగా నాణ్యమైన స్కూలు బ్యాగు, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, డిక్షనరీలు, యూనిఫామ్,, షూ, సాక్సు, బెల్టు, టైలను పాఠశాల పునఃప్రారంభం రోజునే విద్యార్థులకు అందించారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర (ఎస్‌ఆర్‌కేవీఎం) పేరుతో కిట్లను అందించాలని నిర్ణయించింది. అయితే పూర్తి స్థాయిలో యూనిఫామ్, షూలను అందించలేదు. దీంతో తొలిరోజు విద్యార్థులకు పూర్తి స్థాయిలో ఎస్‌ఆర్‌కేవీఎం కిట్లను అందించడంలో వైఫల్యం చెందింది.



జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల వివరాలు

ఫౌండేషన్ పాఠశాలలు	1,054
బేసిక్ ప్రైమరీ స్కూళ్లు	301
మోడ్రన్ ప్రైమరీ	613
ప్రాథమికోన్నత పాఠశాలలు	8
హైస్కూల్, హైస్కూల్ ప్లస్	262
మొత్తం	2,238

నత్తనడకన బదిలీలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియను వేసవి సెలవుల్లోనే పూర్తి చేసేవారు. దీంతో పాఠశాలల పునఃప్రారంభం నాటికి అన్ని స్కూళ్లలో ఉపాధ్యాయులు ఉండేవారు. మొదటి రోజు నుంచే పిల్లలకు విద్యాబోధన అందించేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. సకాలంలో బదిలీల ప్రక్రియ పూర్తి కాకపోవడంతో పాఠశాలల పునఃప్రారంభం నాటికి ఉపాధ్యాయుల కొరత తలెత్తనుంది.

అవగాహన కల్పిస్తున్నాం



ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు చక్కటి బోధన అందుతుంది.. తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడుల్లోనే చేర్పించాలి. వారి భవితకు బంగారు బాటలు వేయాలి. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని మౌలిక వసతులతో పాటు నాణ్యమైన విద్య అందిస్తున్నాం. పాఠ్యపుస్తకాలు, ఇతర విద్యాసామగ్రిని అందిస్తాం. ఈ మేరకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి తల్లిదండ్రుల్లో అవగాహన కల్పిస్తున్నాం. – కేవీఎన్ కుమార్, డీఈఓ, తిరుపతి



విద్యార్థులకు కనీసం కుర్చీలు కూడా లేని తరగతి గది



పూర్తికాని మరుగుదొడ్ల నిర్మాణం

అడ్మిషన్లు లేని అటానమస్!

ప్రతిష్టాత్మక టీటీడీ నిర్వహణలోని విద్యాలయాలు.. అటానమస్ హోదా దక్కింది.. సొంతంగా అడ్మిషన్లు చేపట్టే మహత్తర అవకాశం అందుబాటులోకి వచ్చింది. విద్యార్థులకు బంగరు భవితను అందించే మహద్భాగ్యం వరించింది. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా పరిస్థితి తయారైంది. స్వయంప్రతిపత్తి హోదా ఫలాలను పిల్లలకు అందించే అదృష్టం.. అధికారుల అలసత్వంతో దూరమైంది. చివరకు ప్రవేశాలకు కరువై విద్యార్థులను వెతుక్కోవాల్సిన దుస్థితి దాపురించింది. పేరుకే అటానమస్.. పెత్తనం మాత్రం ప్రభుత్వం చేతిలోనే పెట్టేసిన పరిస్థితి తలెత్తింది. ఈ క్రమంలో టీటీడీ అధికారుల నిర్లక్ష్య వైఖరిపై విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. పేద బిడ్డల భవిష్యత్‌తో ఆడుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- స్వయం ప్రతిపత్తి హోదా దక్కినా.. టీటీడీ విద్యాసంస్థల్లో ప్రవేశాలు కరువు
- సొంతంగా డిగ్రీ అడ్మిషన్లు చేపట్టేందుకు ప్రభుత్వ అనుమతి కోరని అధికారులు
- ఓఎమ్‌డీసీ ద్వారానే కసరత్తు సాగుతోందంటున్న విద్యామండలి
- అగమ్యగోచరంగా 180 మంది తాత్కాలిక అధ్యాపకుల భవిత
- టీటీడీ నిర్లక్ష్యంపై మండిపడుతున్న విద్యార్థి సంఘాలు



తిరుపతి సిటీ : ప్రపంచ ప్రసిద్ధి ఆధ్యాత్మిక సంస్థ టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న విద్యాలయాలపై అధికారులు శీతకన్ను వేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎంతో ప్రతిష్టాత్మకమైన అటానమస్ హోదా సాధించి ఏడాది గడుస్తున్నా స్వయంప్రతిపత్తి ఫలాలు విద్యార్థులకు దక్కడం లేదు. ప్రస్తుతం అటానమస్ హోదాతో కొనసాగుతున్న ఎస్వీ ఆర్ట్స్, ఎస్పీడబ్ల్యూ, ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలల్లో సొంతంగా డిగ్రీ అడ్మిషన్లు చేపట్టే అవకాశముంది. అయితే టీటీడీ అధికారుల నిర్లక్ష్య ధోరణితో ప్రభుత్వ అనుమతి రాకపోవడం గమనార్హం. దీంతో ఈ ఏడాది సైతం ఉన్నత విద్యామండలి ఆదేశాలతో ఆన్‌లైన్ అడ్మిషన్లు, మాడ్యూల్ ఫర్ డిగ్రీ కాలేజస్ (ఓఎమ్‌డీసీ) ద్వారా రాష్ట్ర స్థాయి వెబ్‌కౌన్సిల్ విధానంలో డిగ్రీ ప్రవేశాలు చేపట్టనున్నారు. అటానమస్ హోదా అంటే కేవలం పరీక్షలను సొంతంగా నిర్వహించి ఫలితాలను విడుదల చేయడంతోనే అధికారులు సరిపెడుతున్నారు. దీంతో రాష్ట్ర స్థాయి ఓపెన్ కాంపిటీషన్‌లో పేద, గ్రామీణ విద్యార్థులకు అన్యాయం జరుగుతోంది. ఈ క్రమంలోనే పలువురు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి.

ఫలితం శూన్యం

టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న మూడు డిగ్రీ కళాశాలలకు అటానమస్ హోదా దక్కినా వాటి ఫలాలను విద్యార్థులకు అందించే దిశగా అడుగులు వేయడంలో అధికారులు విఫలమయ్యారు. దీంతో స్వయంప్రతిపత్తి కేవలం పేరుకే పరిమితమైనట్లు పలువురు ఉద్యోగులు, అధ్యాపకులు పెదవి విరుస్తున్నారు. హోదాతో దాతలను ఆకర్షించి కళాశాలలో విద్యార్థులకు మరింత అధునాతన మౌలిక వసతులు, నూతన భవనాలు నిర్మించే అవకాశాన్ని టీటీడీ యాజమాన్యం కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధ్యాపకుల పరిస్థితి దయనీయం

టీటీడీ ఆధ్వర్యంలోని జూనియర్, పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలలో గత 25 ఏళ్లుగా పనిచేస్తున్న 180మంది తాత్కాలిక ఉద్యోగుల భవిష్యత్ అగమ్య గోచరంగా మారింది. టైం స్కేల్ లేదా శాశ్వత ఉద్యోగులుగానో టీటీడీ గుర్తించకుండా కాలయాపన చేస్తోంది. అటానమస్ హోదా లభించడంతో తమ జీవితాలలో వెలుగులు నిండినట్లేనని భావించిన తాత్కాలిక ఉద్యోగులకు చివరకు నిరాశే మిగిలింది. దీంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది. టీటీడీ విద్యాసంస్థలలో 35ఏళ్లుగా నియామకాలు చేపట్టకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడంలేదని పలువురు విమర్శిస్తున్నారు.

ఈ నెలలో నోటిఫికేషన్ వచ్చేనా?

ఉన్నత విద్యామండలి డిగ్రీ అడ్మిషన్ల కోసం కసరత్తుసాగిస్తోందని అధికారులు చెబుతున్నారు. ఇంటర్ రెగ్యులర్ ఫలితాలు విడుదలై 3 నెలలు గడిచింది. ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు సైతం ఇటీవల విడుదలయ్యాయి. కానీ డబుల్ మేజర్ సబ్జెక్ట్ విధానం అమలు చేయాలనే ఉద్దేశంతో నియమించిన కమిటీ నివేదిక సైతం నెల క్రితం వచ్చేసింది. అయితే ఇప్పటికీ ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియకు నోటిఫికేషన్ విడుదల కాకపోవడం గమనార్హం. ఈ నెలలో అయినా నోటిఫికేషన్ విడుదలయ్యేనా అంటూ విద్యార్థులు, తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నారు. ప్రైవేటు విద్యాసంస్థలు అనధికారికంగా ఇప్పటికే సీట్ల భర్తీ ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్లు సమాచారం. దీంతో ప్రభుత్వ, టీటీడీ విద్యాసంస్థలలో ప్రవేశాలకు భారీగా గండిపడే ప్రమాదం ఉంది.

ప్రతిష్ట పెరిగేది




అటానమస్ హోదాలో స్వయంగా అడ్మిషన్లకు అనుమతి లభించి ఉంటే కళాశాలల ప్రతిష్ట పెరిగేది. దీంతో ప్రతి అటానమస్ డిగ్రీ కళాశాలలో పేద విద్యార్థులకు సులువుగా అడ్మిషన్లు లభించి ఉన్నత విద్యను అభ్యసించే సౌలభ్యం ఉండేది. కానీ టీటీడీ నిర్లక్ష్యం కారణంగా పేద పిల్లలకు అన్యాయం జరిగింది. ఈ క్రమంలోనే కళాశాల సీట్లతో పాటు హాస్టల్ సీట్లను సైతం టీటీడీ పెంచాల్సిన అవసరముంది. – బి.స్రవంతి, పీడీఎస్‌ఓ జిల్లా సభ్యులు, తిరుపతి

చిన్నచూపు బాధాకరం




అటానమస్ హోదా సాధించినా ఫలితం శూన్యం. హోదా ఫలాలను విద్యార్థులకు అందించాల్సిన బాధ్యత టీటీడీ యాజమాన్యానిదే. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో టీటీడీ కళాశాలలకు స్వయంప్రతిపత్తి హోదా వచ్చింది. ప్రస్తుతం విద్య వ్యవస్థను టీటీడీ చిన్న చూపు చూడటం బాధాకరం. తిరుపతిలో ఇప్పటివరకు ప్రభుత్వ కళాశాల లేదు. కేవలం టీటీడీ కళాశాలలపైనే పేద విద్యార్థులు ఆధారపడి ఉన్నారు. ఇప్పటి వరకు డిగ్రీ అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదల కాకపోవడం దారుణం. – బి.ఓబుల్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, తిరుపతి

దిశగా అడుగులు వేయలేదు



నాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధించిన ఎస్పీడబ్ల్యూ, ఎస్‌జీఎస్, ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలకు గత ప్రభుత్వ హయాంలో పూర్తి స్థాయి అటానమస్ హోదా వచ్చింది. కానీ అటానమస్ సాధించినా అడ్మిషన్ల విషయంలోనూ, పరిపాలనలోనూ స్వతహాగా నిర్ణయాలు తీసుకునే దిశగా టీటీడీ యాజమాన్యం అడుగులు వేయలేదు. హోదాను సద్వినియోగం చేసుకుని కళాశాల అభివృద్ధికి కృషి చేయకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. – చిన్నా, ఏఐఎస్‌ఏ జిల్లా కార్యదర్శి, తిరుపతి

ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం



తిరుపతిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు లేకపోవడం బాధాకరం. ప్రస్తుతం ఉన్న టీటీడీ కళాశాలలకు అటానమస్ హోదా దక్కినా అధికారుల నిర్లక్ష్యంతో స్వతహాగా అడ్మిషన్లు చేపట్టలేని పరిస్థితి ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వ అనుమతుల కోసం టీటీడీ అధికారులు ప్రయత్నించి ఉంటే అటానమస్ హోదాతో ఆయా కళాశాలలు అడ్మిషన్లు చేపట్టి మెరిట్ స్టూడెంట్స్‌కు అవకాశం దక్కేది. ఆన్‌లైన్ ద్వారా చేపట్టే ప్రవేశాలతో పేదలు ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదముంది. – హేమాద్రి యాదవ్, స్టూడెంట్స్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు, తిరుపతి


ఉద్యమం.. యువతే కీలకం



విద్యార్థి, యువజన విభాగం నేతలతో మాట్లాడుతున్న భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : కూటమి ప్రభుత్వ అరాచక పాలనపై చేపట్టిన ఉద్యమంలో యువత పాత్ర కీలకమని వైఎస్సార్‌సీపీ తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో యువనేతలతో సమావేశం నిర్వహించారు. భూమన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలో ప్రజలకు చేసింది శూన్యమని తెలిపారు. సంక్షేమాన్ని గాలికి వదిలేసి కక్ష పూరిత రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. అక్రమ కేసులు బనాయించడం మినహా అభివృద్ధిని విస్మరించాలని వెల్లడించారు. ఈ నేపథ్యంలో ప్రజల తరఫున వైఎస్సార్‌సీపీ పోరాటం సాగిస్తోందన్నారు. ప్రభుత్వం మెడలు వంచి ప్రజలకు అన్ని పథకాలు అందించేలా చూడాల్సిన బాధ్యత మనపై ఉందని సూచించారు. ప్రభుత్వ విధానాలపై వైఎస్సార్‌సీపీ కొనసాగించే యుద్ధానికి యువత సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. యువతకు లక్షల ఉద్యోగాలు ఇస్తామని, నిరుద్యోగ భృతి అందిస్తామని బూటకపు హామీలతో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ మోసం చేశారని ఆరోపించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి, విద్యార్థివిభాగం జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు ఉదయ్‌వంశీ, ఓబుల్‌రెడ్డి, టౌన్‌బ్యాంక్ డైరెక్టర్ బ్రహ్మానందరెడ్డి, నేతలు లవ్లీ వెంకటేష్, ముప్పాల సాయికుమారి పాల్గొన్నారు.

పరిపూర్ణం.. తెప్పోత్సవం



తిరుచానూరు పద్మావతీ దేవి వార్షిక తెప్పోత్సవాలు ఐదోరోజు బుధవారంతో పరిపూర్ణమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం 5.30 గంటలకు అమ్మవారి మూలమూర్తికి అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం 2.30 గంటలకు సిరులతల్లిని పుష్కరిణి మధ్యలోని నీరాడ మండపంలో కొలువుదీర్చారు. అనంతరం వేడుకగా స్నపన తిరుమంజనం జరిపించారు. సాయంత్రం 6.30గంటలకు దివ్యాలంకార శోభితురాలైన శ్రీవారి దేవేరి తెప్పపై పుష్కరిణిలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. రాత్రి వైభవంగా అమ్మవారికి గరుడసేవ నిర్వహించారు. ఆలయ డిప్యూటీ ఈఓ హరీంద్రనాథ్, ఏఈఓ దేవరాజులు, సూపరింటెండెంట్లు రమేష్, శ్రీవాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ పాల్గొన్నారు. – చంద్రగిరి

క్లుప్తంగా

‘వందనం’..మంగళం!

- రేపే కలెక్టరేట్ వద్ద వైఎస్సార్‌సీపీ నిరసన


హర్షిత్‌రెడ్డి


ఉదయ్‌వంశీ

తిరుపతి రూరల్: కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించిన తల్లివందనం పథకానికి మంగళం పాడేసిందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, యువజన విభాగం అధ్యక్షుడు ఉదయ్‌వంశీ మండిపడ్డారు. బుధవారం వారు మాట్లాడుతూ ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ వద్ద నిరసనకు దిగుతున్నట్లు వెల్లడించారు. 2024–25 విద్యాసంవత్సానికి సంబంధించి తల్లికి వందనం కింద ఒక్క రూపాయి కూడా జమ చేయలేదన్నారు. 2025–26 విద్యాసంవత్సరం ప్రారంభమైనా ఆ పథకం ఊసే ఎత్తడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే నిరసనకు దిగుతున్నామని, కలెక్టర్‌కు వినతిపత్రం అందించనున్నట్లు వివరించారు.

‘తోతాపురి’.. రూ.8కి కొనాల్సిందే!

పాకాల : తోతాపురి రకం మామిడిని ర్యాంప్ ఓనర్లు, వ్యాపారులు తప్పనిసరిగా కిలో రూ.8లకు కొనుగోలు చేయాల్సిందే అని ఆర్‌డీఓ రామ్మోహన్ స్పష్టం చేశారు. బుధవారం దామలచెరువులో ఆయన మామిడి రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఆర్‌డీఓ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి రూ.4లు అందిస్తామని, గుజ్జు ఫ్యాక్టరీ యజమానులకు సైతం ఈ మేరకు ఆదేశాలు జారీ చేస్తామని వెల్లడించారు. రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ సుదర్శన్‌ప్రసాద్, తహసీల్దార్ సంతోష్‌సాయి పాల్గొన్నారు.

ఆదేశాలు బేఖాతర్

క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆర్‌డీఓ ఇచ్చిన ఆదేశాలను సైతం ర్యాంప్ ఓనర్లు, వ్యాపారులు బేఖాతర్ చేశారు. రైతుల అవసరాలను ఆసరాగా తీసుకుని తోతాపురి రకం మామిడిని కిలో రూ.5 చొప్పున కొనుగోలు చేశారు. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు.

భక్తిశ్రద్ధలతో ఉపనిషత్తుల సందేశం

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : టీటీడీ, హిందూ ధర్మప్రచార సమితి సహకారంతో బుధవారం స్థానిక అన్నమాచార్య కళామందిరంలో 12 గంటల పాటు నిరంతరాయంగా భక్తి శ్రద్ధలతో ఉపనిషత్తుల సందేశ కార్యక్రమం నిర్వహించారు. పౌరాణిక శిరోమణి, ధర్మప్రచార పరిషత్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ పొన్నా కృష్ణమూర్తి వ్యాఖ్యతగా వ్యవహరించారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

తిరుపతి క్రైం: జల్సాలకు అలవాటు పడి కార్ల షోరూములు, షాపింగ్‌మాల్స్‌లో చోరీలకు పాల్పడే అంతర్రాష్ట్ర దొంగను పట్టుకున్నట్లు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. బుధవారం ఆయన పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తిరుపతి–రేణిగుంట రోడ్డులో ఉన్న భార్గవి ఆటో మారుతి సుజుకి షోరూమ్‌లోకి ఈ నెల 3వ తేదీన గుర్తు తెలియని వ్యక్తులు వెనుక నుంచి ప్రవేశించి మేనేజర్ కాళ్లు, చేతులు కట్టేసి సెల్, క్యాష్ కౌంటర్‌లో రూ.5 లక్షల నగదును చోరీ చేశారన్నారు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం తిరుచానూరు బైపాస్ రోడ్డు, ఉప్పరపల్లి క్రాస్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న మధ్యప్రదేశ్‌లోని ఖాండ్వా జిల్లా న్యూహార్ సూద్ తాలూకా జూనాపని గ్రామానికి చెందిన మంగళ్‌సింగ్ చౌహాన్(28)ను అరెస్టు చేశామన్నారు. నిందితుడి నుంచి రూ.1,48,500 నగదు, ఒక ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దొంగను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన తిరుపతి సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు వి.చిన్న పెద్దయ్య, శివకుమార్ రెడ్డి, ప్రకాష్‌కుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ కుమార్ రెడ్డి క్రైమ్ పార్టీ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

రెక్కాడితే కానీ డొక్కాడని బతుకులపై పచ్చ మూక ప్రతాపం చూపింది. చేతివృత్తులతో జీవనం సాగించేవారి పొట్టగొట్టింది. ప్రభుత్వ భూమిని కాజేసేందుకు నిరుపేదల జీవితాల్లో నిర్వేదం నింపింది. కుండలు.. ప్రమిదలు చేసుకుంటూ బడుగుల నోట్లో మట్టి కొట్టేసింది. దయాదాక్షిణ్యం లేకుండా అధికారమే అండగా 50 కుటుంబాలను రోడ్డుపాలు చేసింది. రెవెన్యూ సిబ్బంది సహకారంతో అరాచకాలకు తెగబడింది. భూ ఆక్రమణే లక్ష్యంగా దౌర్జన్యకాండకు తెరతీసింది.


బాధిత మహిళతో మాట్లాడుతున్న ఎంపీ గురుమూర్తి, మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

బాధితులకు పరామర్శ

కుల వృత్తుల కడుపుకొట్టి వారి ఇళ్లను నేలమట్టం చేసి ప్రాంతాన్ని ఎంపీ గురుమూర్తి, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం పరిశీలించారు. బాధితులను ఓదార్చి జరిగిన ఘటనపై ఆరా తీశారు. చేతి వృత్తుల జీవితాలను కూటమి ప్రభుత్వం ఛిద్రం చేయడం దారుణమని మండిపడ్డారు. ప్రభుత్వ భూములను కబ్జా చేయడమే కాకుండా, పేదల ఇళ్లను సైతం కూల్చేయడం హేయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా వ్యతిరేక ప్రభుత్వం త్వరలోనే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు.

బడుగు బతుకుల ఆక్రందన

- చేతివృత్తులను చిదిమేసిన టీడీపీ నేతలు
- దౌర్జన్యకాండకు అండగా నిలిచిన రెవెన్యూ, పోలీసు అధికారులు
- 50 కుమ్మరి కుటుంబాలు రోడ్డుపాలు
- ఇలగనూరులో దారుణం
- నిరుపేదల నిర్వేదం

తిరుపతి సిటీ: శ్రీకాళహస్తి మండలం ఇనగలూరులో పేదల జీవితాలను టీడీపీ నేతలు అతలాకుతలం చేసేశారు. కనికరించమని కాళ్లావేళ్లా పడినా దారుణంగా తరమికొట్టారు. ఇటీవల జరిగిన ఈ ఘటన జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశమైంది. పచ్చ మూక దాష్టీకంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. వివరాలు.. ఇలగనూరు గ్రామ రెవెన్యూ లెక్కదాఖలా 150లోని 1, 2 సర్వే నంబర్లలో 3.62 ఎకరాల భూమి ఉంది. అందులో 1.50 ఎకరాల్లో గత 50 ఏళ్లుగా కుమ్మరి సామాజికవర్గానికి చెందిన 50 కుటుంబాలవారు నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. మట్టికుండలు, ప్రమిదలు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవారు. తయారు చేసిన ప్రమిదలు, కుండలను శ్రీకాళహస్తి, తిరుపతిలో విక్రయించుకుంటూ పొట్టపోసుకునేవారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత చేతివృత్తులు చేసుకునే పేదల భూములపై టీడీపీ నేతలు కన్నేశారు. అది ప్రభుత్వ భూమి అంటూ రెవెన్యూ అధికారులను ఉసిగొల్పారు. ముందస్తుగా ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అందులోని పేదల ఇళ్లను నేలమట్టం చేశారు. పోలీసుల సహకారంతో జేసీబీల ద్వారా చదును చేయించారు. నిరుపేదలను భయభ్రాంతులకు గురిచేసి మొత్తం భూమిని స్వాధీనం చేసుకున్నారు.

పట్టించుకోని అధికారులు

అదే సర్వే నంబర్‌లో 2.10ఎకరాల్లో టీడీపీకి చెందిన కొందరు గృహాలు నిర్మించుకున్నారు. వాటి జోలికి రెవెన్యూ అధికారులు వెళ్లకపోవడం గమనార్హం. అదే ఇలగనూరు పంచాయతీలోని గ్రామ కంఠానికి చెందిన భూములు, పశువుల బైళ్లు, ప్రభుత్వ పోరంబోకు భూములు సుమారు 150 ఎకరాలను కూటమి నేతలు ఆక్రమించేశారు. చుట్టూ కంచె వేసుకున్నప్పటికీ అధికారులు కన్నెత్తి చూడలేదు.

రూ.లక్షల మట్టి చదును

బాధితులు సుదూర ప్రాంతాల నుంచి రూ.లక్షలు వెచ్చింది కుండల తయారీకి బంక మట్టిని తీసుకువచ్చి నిల్వ చేసుకున్నారు. ఆ బంక మట్టిని కూడా టీడీపీ నేతలతో కలిసి అధికారులు దుర్మార్గంగా జేసీబీతో చదును చేసేశారు. 50 కుటుంబాలు ఒక్కొక్కరు సుమారు రూ.60వేలు ఖర్చు పెట్టి నిల్వ చేసిన మట్టిని నిరుపయోగంగా మార్చేశారు. కాళ్లావేళ్లా పడి బతిమలాడినా అధికారులు కనికరించలేదని, ఖరీదైన మట్టిని చదును చేసేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ నేతల ఆధ్వర్యంలో తమ కుల వృత్తిపై దాడి చేశారని, ఇంతటి దారుణమైన పాలన ఇప్పటి వరకు చూడలేదని మహిళలు విలపిస్తున్నారు.


పేదల భూమిని చదును చేసి రాళ్లు నాటిన దృశ్యం


న్యాయం చేయాలంటూ వాపోతున్న బాధిత మహిళలు

“ న్యాయం చేయాలి

కుల వృత్తులకు ప్రోత్సాహాలను అందించి ఆదుకుంటామని మాట ఇచ్చిన కూటమి ప్రభుత్వం ప్రస్తుతం చేతివృత్తుల వారిపై ప్రతాపం చూపుతోంది. గత 50 ఏళ్లుగా ఇదే ప్రాంతంలో కుండలు, ప్రమిదలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. ఎటువంటి సమాచారం ఇవ్వకుండా మా ఇళ్లపై దాడి చేసి నేలమట్టం చేశారు. టీడీపీ నేతల కనుసన్నలలో ఇదంతా జరిగినా పోలీసులు, అధికారులు వారి వైపే మాట్లాడుతూ చోద్యం చూస్తున్నారు. సుమారు రూ.5లక్షల విలువ చేసే బంక మట్టిని ధ్వంసం చేశారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయం చేయాలి.

– ఇలగనూరులోని బాధిత మహిళలు


గరుడ వాహనంపై గోవిందుడు


మోహినీ అవతారంలో వేంకటేశ్వర స్వామి

వడమాలపేట (విజయపురం): అప్పలాయగుంటలో వెలసిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో ఐదవ రోజు బుధవారం ప్రసన్న వేంకటేశ్వరస్వామి గరుడ వాహనంపై విహరించారు. పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలతో స్వామి ఊరేగుతుండగా భక్తుల గోవింద నామస్మరణతో మాడ వీధులు మార్మోగాయి. ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు పల్లకిలో మోహినీ అవతారంలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు.

గరుడ సేవలో తరించిన భక్తజనం

బ్రహ్మోత్సవాల్లో ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసే గరుడ సేవలో పాల్గొన్న అశేష భక్తజనం స్వామిని కనులారా దర్శించి తరించారు. రాత్రి 7.30 గంటలకు స్వామివారు సుందరంగా అలంకరితుడై గరుత్మంతుడిపై విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. కోలాటాల నడుమ శ్రీవారు భక్తులను కటాక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ హరీంద్రనాథ్, ఏఈఓ దేవరాజు, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, అర్చకులు పాల్గొన్నారు.


గరుడ వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

విత్తనాలు.. వచ్చాయ్.. వెళ్లాయ్!

- రైతులకు కనీసం అందని సమాచారం
- కూటమి నేతల కనుసన్నల్లోనే పంపకం
- అన్నదాతలు ప్రశ్నించినా రాని సమాధానం


రైతు సేవాకేంద్రానికి తలుపులు వేసుకుని లోపల నుంచి రైతులను బెదిరిస్తున్న వీఏఏ రోహిత్


రైతు సేవాకేంద్రానికి తలుపు మూసివేసిన వీఏఏ రోహిత్

పాకాల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్నివర్గాలకు అన్యాయం చేస్తూనే ఉంది. ఈ క్రమంలోనే బుధవారం అన్నదాతలకు సైతం ద్రోహం చేసింది. వేరుశనగ విత్తన కాయల కోసం వెళ్లిన రైతుల నోట్లో మట్టి కొట్టింది. వివరాలు.. పాకాల మండలానికి 919.8 క్వింటాళ్ల వేరుశనగ విత్తన కాయలు వచ్చాయి. ఇవి సుమారు వెయ్యి ఎకరాల్లో సాగు చేసుకునేందుకు ఉపయోగపడతాయి. సాధారణంగా పాసుపుస్తకం కలిగిన రైతులు, పంటలు వేసే విస్తీర్ణం మేరకు విత్తనాలు కేటాయిస్తారు. 30 కేజీల బస్తా ధర రూ.2,790లు ఉండగా, రాయితీపై రూ.1674లకు అందిస్తారు. మండలంలోని అన్ని పంచాయతీలకు 100 నుంచి 200ల బస్తాల వరకు ప్రభుత్వం విత్తన కాయలను సరఫరా చేసింది. ఈ క్రమంలోనే మండలంలోని మొగరాల పంచాయతీకి 200 బస్తాల విత్తన కాయలు వచ్చాయి. రైతు సేవాకేంద్రంలో వీఏఏ రోహిత్‌ను ఈ మేరకు పలువురు రైతులు కలిసి విత్తనాలు కావాలని అడిగారు. అయితే మొత్తం విత్తనాలు పంపిణీ చేసేశామని సదరు వీఏఏ చెప్పడంతో రైతులు అవాక్కయ్యారు. ఎవరికీ సమాచారం లేకుండా ఎలా పంపిణీ చేశారని ఉద్యోగిని ప్రశ్నించారు. దీంతో రైతులను బయటపెట్టి రైతు సేవాకేంద్రానికి తలుపులు వేసేసుకున్నాడు. దీనిపై వివరణ కోరిన మీడియాను సైతం వీఏఏ రోహిత్ లెక్కపెట్టలేదు. మీడియా వద్దనే విత్తనాలు తీసుకోండి అంటూ రైతులను బెదిరించాడు. బాధిత రైతులు మండిపడడంతో నెమ్మదిగా తలుపు తీసి అక్కడ నుంచి ఉడాయించాడు.

మాకు సమాచారం లేదు



ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేస్తున్న విషయం మాకు తెలియదు. ఇప్పుడు వెళ్లి అడిగితే వీఏఏ రోహిత్ 200ల బస్తాలు వచ్చాయని, వాటిని పంపిణీ చేసేశామని చెబుతున్నాడు. ఎవరికి సరఫరా చేశారో తెలియడం లేదు. అడిగితే రెండు రోజుల తర్వాత రండి అంటున్నాడు. – ఏ.మహదేవ, మొగరాల

చర్యలు తీసుకుంటాం

స్థానిక రైతులను బయట పెట్టి వీఏఏ రోహిత్ రైతు సేవాకేంద్రానికి తలుపులు వేసుకోవడం తప్పు. రైతులతో దురుసుగా ప్రవర్తించడం కూడా సరికాదు. అతడిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం. శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

– పుష్పావతి, ఏఓ, పాకాల మండలం

ప్రమాదవశాత్తు మహిళ మృతి

చిట్టమూరు : మండలంలోని తాడిమేడు క్రాస్ వద్ద బుధవారం రాత్రి ప్రమాదవశాత్తు ఓ మహిళ మృతి చెందింది. వివరాలు.. నాయుడుపేట మండలం అగచాట్లపురం గ్రామానికి చెందిన వెంకయ్య, పోలమ్మ భార్యాభర్తలు. ఇరువురూ దివ్యాంగులే కావడంతో మూడు చక్రాల ఎలక్ట్రిక్ బైక్‌పై చిట్టమూరు మండలం కొత్తగుంటకు వచ్చి తిరుగుప్రయాణమయ్యారు. తాడిమేడు క్రాస్ వద్దకు వచ్చేసరికి ప్రమాదవశాత్తు పోలమ్మ చున్నీ బైక్ చక్రానికి తగులుకుంది. దీంతో ఆమె కింద పడిపోయింది. చున్నీ మెడకు బిగుసుకుని కోసుకుపోవడంతో అక్కడికక్కడే మరణించింది. దీనిపై సమాచారం అందుకున్న కుటుంబీకులు హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని పోలమ్మ మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు. ఈ ప్రమాదంపై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు.

‘కొమ్మినేని’ అరెస్ట్ అక్రమం


మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వాకాడు : కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్న జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్ట్ అక్రమమని వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. బుధవారం వాకాడులోని నివాసంలో కోట, చిట్టమూరు, వాకాడులోని వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ డిబేట్ జరిగిన అదే రోజు కొమ్మినేని వివరణ ఇవ్వడం, క్షమాపణ చెప్పడం జరిగిందని, అయినా కక్షసాధింపులకు పాల్పడడం సరికాదన్నారు. కొమ్మినేని శ్రీనివాసరావుపై సంబంధంలేని ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టి హైకోర్టుతో మొట్టికాయలు వేయించుకున్నారని వెల్లడించారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని తెలిపారు. ఏడాదిగా మహిళలపై నిత్యం అకృత్యాలు జరుగుతున్నా పట్టించుకోని కూటమి ప్రభుత్వం.. రాజకీయ కక్షసాధింపులకు పెద్దపీటవేస్తోందన్నారు. అలాగే కాకాణి గోవర్ధన్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేసి పీటీ వారెంటు పేరుతో పలు ఇబ్బందులకు గురి చేయడం అరాచకమని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ప్రజలే కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. వెన్నుపోటు దినం విజయవంతం కావడంతో డైవర్షన్ చేసేందుకు కూటమి నేతలు కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. నేతలు కొడవలూరు దామోధర్‌రెడ్డి, దేవారెడ్డి నాగూర్‌రెడ్డి, గూడూరు సుధాకర్‌రెడ్డి, గూడూరు వెంకటేశ్వర్లురెడ్డి, తూపిలి మధురెడ్డి, పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, వాకాటి రవి, పెళ్లూరు కోటీశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఎస్జీటీ బదిలీల్లో రగడ

- స్పౌజ్ పాయింట్లపై రచ్చ
- అధికారుల ఎదుట ఓ టీచర్ ఆత్మహత్యాయత్నం
- డీఆర్‌ఓను చుట్టుముట్టిన టీచర్లు
- బందోబస్తు నడుమ కౌన్సెలింగ్


మాట్లాడుతున్న డీఆర్‌వో మోహన్‌కుమార్


డీఆర్‌వోను చుట్టుముట్టిన ఎస్జీటీలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని షర్మన్ బాలికోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఎస్జీటీ కౌన్సెలింగ్‌లో స్పౌజ్ పాయింట్ల విషయంలో కొందరికి న్యాయం ..మరికొందరికి అన్యాయం చేశారు. విద్యాశాఖ అధికారులు ఇష్టానుసారం ఆకస్మిక నిర్ణయాలు తీసుకుంటూ టీచర్లను ముప్పుతిప్పలు పెట్టారు. ఎస్జీటీ బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియలో స్పౌజ్ పాయింట్ల విషయంలో వివాదం తలెత్తింది. మంగళవారం రాత్రి, బుధవారం నిర్వహించిన బదిలీల కౌన్సెలింగ్‌లో స్పౌజ్ పాయింట్ల విషయంలో 204 సీరియల్ నంబర్ లోపు ఉన్న చాలా మంది టీచర్లకు కోరుకున్న ప్రాంతానికి బదిలీ చేశారు. అయితే బుధవారం వేకువ జామున 3 గంటల సమయంలో స్పౌజ్ పాయింట్ల విషయంలో నష్టం జరుగుతోందని ఓ ఉపాధ్యాయుడు ఆత్మహత్య చేసుకుంటానని భయాందోళన సృష్టించారు. దీంతో కౌన్సెలింగ్ ప్రక్రియను విద్యాశాఖ అధికారులు ఆపివేశారు.

డీఆర్‌ఓను చుట్టుముట్టిన నేతలు

బుధవారం ఉదయం 10.30 గంటలకు తిరిగీ కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభించారు. ఈ ఘటన విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో డీఆర్‌వో మోహన్ కుమార్ ను కౌన్సెలింగ్ కేంద్రం వద్దకు పంపించారు. డీఆర్‌వో కౌన్సెలింగ్ కేంద్రం వద్దకు చేరుకోగానే యూటీఎఫ్, వైఎస్సార్‌టీఎఫ్, ఎస్టీయూ సంఘాల నేతలు, పలువురు బాధిత టీచర్లు న్యాయం చేయాలంటూ డీఆర్‌వోను చుట్టుముట్టారు. ఆ సమయంలో సంబంధిత టీచర్ల సమస్యలను డీఆర్‌వో స్పష్టంగా విన్న తర్వాత కలెక్టర్, విద్యాశాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. కాసేపు చర్చలు జరిపిన అనంతరం డీఆర్‌వో టీచర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

ఇష్టానుసారం మార్పులు

బదిలీల్లో స్పౌజ్ పాయింట్ల విషయంలో గందరగోళం నెలకొంది. ఇద్దరు భార్యభర్తలు ఎస్జీటీలుగా ఉండి తప్పనిసరి బదిలీలకు దరఖాస్తు చేసుకుంటే స్పౌజ్ నిబంధనల కింద సీనియారిటీ జాబితాలో ముందు ఉన్న వ్యక్తి స్పౌజ్ కు అర్హులైతే తరువాత ఉన్న స్పౌజ్ ఎక్కడికి బదిలీ అవుతారో తెలియదు కాబట్టి జిల్లాలో ఎక్కడైనా కోరుకునే అవకాశం కల్పించాలి. అయితే 8 ఏళ్ల పూర్తి అయిన స్థానంనే పరిగణలోకి తీసుకుని తిరిగి అక్కడే కోరుకోవాలనే వింత నిబంధనను అమలు చేశారు. ఈ నిబంధనతో చాలా మంది టీచర్లు నిరాశ, ఆవేదనకు గురవుతున్నారు. కుప్పంలో పనిచేస్తున్న ఇద్దరు భార్యభర్తలను తిరిగీ కుప్పంలోనే కోరుకోవాలని ఒత్తిడి చేయడం ఎంత వరకు సబబు అని బాధితులు ప్రశ్నించారు.

స్పౌజ్ పాయింట్లు తీసేయాలని..

ఎస్జీటీల కౌన్సెలింగ్ కేంద్రంలోకి ఉపాధ్యాయ సంఘం నేతలను అనుమతించకుండా పోలీసు బందోబస్తును పెట్టి భయాందోళన సృష్టిస్తున్నారు. జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించే గొంతును నొక్కేసి బదిలీల ప్రక్రియను ఇష్టానుసారంగా, ఏకపక్షంగా నిర్వహిస్తున్నారు. ఈ బదిలీల తతంగంలో స్పౌజ్ పాయింట్లు రద్దు చేసుకునే అవకాశం కల్పించాలని ఎస్జీటీలు మొరపెట్టుకుంటున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోని పరిస్థితి. ఇష్టముంటే బదిలీ కోరుకోండి లేకపోతే వెళ్లిపోండి అంటూ హుకుం జారీ చేస్తున్నారు. దీంతో చాలా మంది టీచర్లు బదిలీలు కోరకుండానే వెనుదిరిగారు. కూటమి పాలనలో వింత ధోరణిలో నిర్వహిస్తున్న బదిలీల తతంగంపై టీచర్లు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అత్యుత్తమ సేవలకు ‘స్విమ్స్’


అతిథులతో పట్టాలు అందుకున్న విద్యార్థులు

తిరుపతి కల్చరల్ : స్విమ్స్ యూనివర్సిటీని అత్యుత్తమ సేవలందించే కేంద్రంగా తీర్చిదిద్దుతామని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. బుధవారం మహతి కళాక్షేత్రంలో స్విమ్స్ యూనివర్సిటీ 13వ స్నాతకోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌టీఆర్ సంకల్పంతో స్విమ్స్ ఏర్పాటై ప్రస్తుతం రాష్ట్రమంతటికి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందిస్తోందన్నారు. స్విమ్స్‌కు టీటీడీ సుమారు రూ.60 కోట్లు రెవెన్యూ గ్రాంటు, ప్రాణదాన ట్రస్టుకు, మరో రూ.24 కోట్లు ఇస్తున్నామని వెల్లడించారు. స్విమ్స్ సర్వతోముఖాభివృద్ధికి మాజీ ఐఏఎస్ అధికారి ఐవీ.సుబ్బారావు కమిటీ సూచనల మేరకు అదనంగా రూ.71 కోట్లు నిధులు ఇస్తామని వివరించారు. 550 మంది డాక్టర్లు, నర్సులు, టెక్నీషియన్లను త్వరలో రిక్రూట్ చేస్తామన్నారు. టీటీడీ ఈవో జె.శ్యామలరావు మాట్లాడుతూ 1స్విమ్స్ రాయలసీమకు తిరుమల శ్రీవారు ప్రసాదించిన వరమని చెప్పారు. ఈ రోజు 501 మంది పట్టభద్రులు డిగ్రీలు, మెరిట్ సర్టిఫికెట్లు అందుకుని వైద్య వృత్తిలో ప్రవేశిస్తున్నారని వెల్లడించారు. మధురై ఎయిమ్స్ సీఈవో డాక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ వైద్య వృత్తిలో ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో సేవలు అందించాలన్నారు. అనంతరం వైద్య విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. స్విమ్స్ ఉపకులపతి డాక్టర్ ఆర్‌వీ.కుమార్ స్విమ్స్‌లో ఇటీవల జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు, టీటీడీ అందిస్తున్న ఆర్థిక సహకారం వివరించారు. టీటీడీ పాలక మండలి సభ్యులు సుచిత్ర ఎల్లా, ఎన్.సదాశివరావు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, స్విమ్స్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అకడమిక్ డాక్టర్ జి.రఘునందన స్విమ్స్ డీన్ అల్లాడి మోహన్, రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ బిట్లా స్విమ్స్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ హెచ్.నరేంద్ర, ప్రొఫెసర్ డాక్టర్ జానకి సుభద్ర పాల్గొన్నారు.

డీటీలకు ఉద్యోగోన్నతులు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని పలువురు డిప్యూటీ తహసీల్దార్లకు అడహక్ పద్ధతిలో తహసీల్దార్లుగా ఉద్యోగోన్నతి కల్పించారు. వారిని బదిలీలు చేశారు. ఈ మేరకు బుధవారం నోడల్ అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు వారికి పోస్టింగులు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. కాగా, ఈ ఉద్యోగోన్నతులు తాత్కాలికమేనని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. చిత్తూరు అర్బన్ తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డిని తిరుపతి జిల్లాకు, తిరుపతి జిల్లా డీఎస్‌వో కార్యాలయంలో పనిచేస్తున్న రేఖను చిత్తూరు జిల్లాకు బదిలీ చేశారు.

- తిరుపతి జిల్లాలో పనిచేస్తున్న డిప్యూటీ తహసీల్దార్లు శాంతి (ఆర్డీవో కార్యాలయం, శ్రీకాళహస్తి), తనూజ (డీఎస్‌వో కార్యాలయం, తిరుపతి) ఉద్యోగోన్నతి కల్పించి తిరుపతి జిల్లా కేటాయించారు.
- చిత్తూరు జిల్లాకు కేటాయించిన డీటీలు ఇలా రాజేంద్ర (తిరుపతి), పార్థసారధి (యాదమరి), రమేష్‌బాబు (పూతలపట్టు), కిరణ్ (విజయపురం), జయసింహా (పులిచెర్ల), శ్రీనివాసులు (తిరుపతి), శ్రావన్‌కుమార్ (పెనుమూరు), రాధిక (తిరుపతి), నాగరాజు (కార్వేటినగరం), కొలేష్ (విజయపురం), మాధవి (చౌడేపల్లి), కళ్యాణి (బంగారుపాళ్యం) లకు తహసీల్దార్‌లుగా ఉద్యోగోన్నతి కల్పించారు. వీరందరికీ త్వరలో తహసీల్దార్లుగా మండలాలను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేయనున్నారు.